



వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జి.రాజకుమారి

# తీరని యూరియా కొరత

- అమ్మోనియాతోనే సరిపెట్టుకుంటున్న రైతులు - స్టాక్ వచ్చిందని అధికారులు చెబుతున్నా దొరకని వైనం

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

జిల్లాలో యూరియా కొరత అక్కడక్కడా ఇంకా రైతులను పట్టీ పీడిస్తోంది. జిల్లాకు ఇప్పటికే 10 వేల మెట్రిక్ టన్నులు యూరియా వచ్చిందని, ఇంకా రెండు రోజుల్లో మరో మూడు వేల మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ జిల్లాలో రైతులకు మాత్రం యూరియా సులువుగా దొరకడం లేదు. అవసరమైనంత మేరకు యూరియా దొరకక కొంతమంది రైతులు అమ్మోనియాతోనే సరిపెట్టుకుంటున్నారు. జిల్లాకు వచ్చిన యూరియాను హోల్‌సేల్ డీలర్ల వద్ద భద్రంగా ఉంటున్నప్పటికి రిటైల్ డీలర్లు మాత్రం రైతులను దగా చేస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని రైతులపై అదనపు భారం వేస్తున్నారు. ఇదెక్కడి న్యాయమని రైతులు ప్రశ్నిస్తే అసలు తమ వద్ద యూరియానే లేదంటూ డీలర్లు బుకాయిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే డీలర్లు రూ.265 ఉన్న యూరియాను అధిక ధరకు అమ్ముతున్నారు. రూ.370 నుండి రూ.450 వరకు అమ్ముతున్నారని రైతులు ఏకంగా మీడియా ఎదుటకు వచ్చి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఎప్పుడు లేనంతగా ఈ రబీలో యూరియా సమస్య తలెత్తుతోంది. అయితే అధికారులు మాత్రం యూరియా సమృద్ధిగా ఉందని చెప్పుతూ ప్రకటనలకే పరిమితం అవుతున్నారని, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయడం లేదనే అపవాదును మూటగట్టుకుంటున్నారు. జిల్లాలోని బనగానపల్లె, గోస్పాడు, బండిఆత్మకూర్ మండలాలతో పాటు నంద్యాల పట్టణంలో ఉన్న షాప్‌లలో కూడా యూరియాను అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు బాహాటంగానే చర్చించుకుంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



**యూరియా కొరత లేదు.. అధిక ధరలకు అమ్మితే ఫిర్యాదు చేయండి**

జిల్లాలో యూరియా కొరత లేదు. రైతులకు కావాల్సినంతగా ఉంది. ఎక్కడైనా దొరకపోయినా, అధిక రేట్లకు అమ్మినా రైతు సేవా కేంద్రాల్లో, మండల వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయండి. షాపు పేర్లు చెపితే నేను తగు చర్యలు తీసుకుంటాను. కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని చెప్పడం సరైంది కాదు. ఎందుకంటే యూరియా వున్న ప్రతి షాపు వద్ద వ్యవసాయ శాఖ సిబ్బందిని వుంచి సరియైన ధరకు అమ్మాలని సూచనలు ఇస్తున్నాం.

**- వైవి.మురళీ కృష్ణ. జిల్లా వ్యవసాయ అధికారి, నంద్యాల.**

# లక్ష్యాలను పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి బ్యాంకర్లకు కేటాయించిన రుణ మంజూరు లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రభుత్వ పథకాల రుణ మంజూరుపై సంబంధిత అధికారులు, బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన రుణాల మంజూరులో కొంతమేర ప్రగతి సాధించారని, పెండింగ్‌లో ఉన్న లక్ష్యాన్ని కూడా మార్చి 15వ తేదీలోగా పూర్తి చేయాలని బ్యాంకర్లను సూచించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం, పీఎం సూర్యఘర్, స్టాండ్ అప్ ఇండియా, పిఎంఈజిపి, ముద్ర లోన్స్ తదితర పథకాలకు సంబంధించి రుణాల మంజూరులో వెనుకబడి ఉన్నారనిన్నారు. చేతివృత్తుల వారికి శిక్షణ ఇస్తున్నామని, సంబంధిత వ్యక్తులందరికీ బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోపు రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మాట్లాడుతూ బిసి రుణాల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలన్నిటినీ పూర్తి చేయాలన్నారు. 5 లక్షల యూనిట్ల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు అర్హత సాధించకపోతే రెండు లేదా మూడు లక్షలకు మార్పు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని బ్యాంకర్లను సూచించారు. అనంతరం నాబార్డ్ ద్వారా 2025-26 సంవత్సరానికి సంబంధించి పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ కింద 11,972 కోట్ల వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ నరసింహారావు, నాబార్డ్ డిస్టిక్ డెవలప్మెంట్ మేనేజర్ సుబ్బారెడ్డి, లీడ్ డిస్టిక్ మేనేజర్ రవీంద్ర కుమార్, స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సూర్య ప్రకాష్, కెనరా బ్యాంక్ రీజనల్ హెడ్ సుశాంత్ కుమార్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ పి.వెంకటరమణ, కేడీసీసీ బ్యాంక్ రీజనల్ మేనేజర్ విజయ్ కుమార్, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుల బడ్జెట్ కావాలి

- నంద్యాల గాంధీ చౌక్‌లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

**ప్రజాశక్తి - నంద్యాల**

కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపన్నుల కోసమే ఉందని, సామాన్యుల సంక్షేమం మరిచారని సిపిఎం నాయకులు విమర్శించారు. పేదలపై భారాలు వేయడమే పనిగా పెట్టుకుని, పేదల నడ్డి విరుస్తున్న బడ్జెట్‌కి కొన్ని ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పంపిస్తున్నట్లు తెలిపారు. బడ్జెట్‌ను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం నంద్యాల గాంధీ చౌక్ సెంటర్లో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా.నరసింహులు అధ్యక్షత వహించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ వ్యవసాయం అనుబంధ రంగాలకు కేటాయింపులు పెంచాలని, జాతీయ గ్రామీణ ఉపాదిహామీ పథకానికి 50 శాతం కేటాయింపులు పెంచాలన్నారు. మున్సిపల్, పట్టణంలో ఉపాధి హామీ పథకం ప్రారంభించాలని కోరారు. దళిత, గిరిజన సంక్షేమానికి, మహిళా సంక్షేమానికి కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. జిడిపిలో ఆరోగ్యానికి 3 శాతం, విద్యారంగానికి 6 శాతం కేటాయింపులు పెంచాలని, ప్రజాపంపిణీ కేటాయింపులు పెంచి, ఆహారభద్రత చట్టాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రవేటు రంగానికి బదలాయించటాన్ని ఆపాలని, భీమా రంగంలో 100 శాతం ఎఫ్డిఐలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు నిధుల బదిలీని పెంచాలని, కేంద్ర ప్రయోజిత పథకాలకు కూడా నిధులను పెంచాలని, కేంద్రం రాష్ట్రాలతో పంచుకునే విభాగంలో చేర్చని పెట్రోలియం ఉత్పత్తులపై సెస్సులను, సర్ చార్జీలను రద్దుచేయాలని కోరుతూ ఈనెల 20న నంద్యాల పట్టణంలోని తహాశీల్దార్ కార్యాలయం దగ్గర నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నిరసనలో పట్టణంలోని మేధావులు, కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నంద్యాల మండల కార్యదర్శి వెన్న బాల వెంకట్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కే మహమ్మద్ గౌస్, వెంకటలింగం, సీనియర్ నాయకులు తోట మద్దులు, పట్టణ కమిటీ సభ్యులు జైలాన్, శివ, ప్రజా సంఘాల నాయకులు సుబ్బారావు, శ్రీను, నరసింహ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నంద్యాల అసిస్టెంట్ కమిషనర్‌గా వెంకటదాస్

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

నంద్యాల మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్‌గా డి.వెంకట్ దాస్ రానున్నారు. కమిషనర్‌లు, మేనేజర్‌లను దాదాపు 22 మందిని రాష్ట్ర వ్యాప్తంగా బదిలీలు చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా నంద్యాల మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా వెంకట దాస్‌ను నియమించారు. వెంకటరాజు ఎన్నికల ముందు నంద్యాల మున్సిపాలిటీలోని అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేశారు. ఎన్నికల నేపథ్యంలో ఆయనను నంద్యాల నుండి పల్నాడు జిల్లా మాచర్లకు బదిలీ చేశారు. అక్కడి నుండి గిద్దలూరు మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారు. దాదాపు 8 నెలలు కమిషనర్‌గా పని చేసిన ఆయన బదిలీల్లో భాగంగా నంద్యాలకు రానున్నారు. రెండు మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

# బాధిత రైతులకు న్యాయం చేయాలి

- పనులను తాత్కాలికంగా ఆపండి
- రాంకో సిమెంట్ ఫ్యాక్టరీకి వేస్తున్న రైల్వే పనులను అడ్డుకున్న రైతు సంఘం నేతలు

**ప్రజాశక్తి - సంజామల**

రాంకో సిమెంటు ఫ్యాక్టరీ రైల్వే లైన్ కోసం భూములు కోల్పోతున్న బాధిత రైతులకు న్యాయం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బారాయుడు, ఏ. సురేష్‌లు డిమాండ్ చేశారు. రైల్వే లైన్ అవతల మిగిలిపోయిన భూములను కొనుగోలు చేయాలని, న్యాయం జరిగే వరకు పనులు ఆపాలన్నారు. కొలిమిగుండ్ల మండలంలో నిర్మిస్తున్న రాంకో సిమెంట్ ఫ్యాక్టరీకి రాఖీ నుంచి కోవెలకుంట్ల రైల్వే స్టేషన్ వరకు సంజామల మండలం రామిరెడ్డిపల్లె గ్రామ పరిధిలో చేపడుతున్న రైల్వే లైన్ పనులను ఎపి రైతు సంఘం నాయకులు మంగళవారం అడ్డుకున్నారు. పోలీసులు, రాంకో సిమెంట్ యాజమాన్యానికి రైతు సంఘం నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో రాంకో సిమెంట్ యాజమాన్యం ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు తగు న్యాయం చేస్తామని రైతు సంఘం నేతలకు హామీనిచ్చారు. అనంతరం రైతు సంఘం నాయకులు రైల్వే లైన్ నిర్మిస్తున్న రైతుల పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంజామల మండలం రామిరెడ్డి పల్లె గ్రామంలో 300 ఎకరాల భూములను ఈ రైల్వే లైన్ కోసం భూ సేకరణ చేపట్టారని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయకుండా ఫ్యాక్టరీ వారు ఇష్టం వచ్చినట్లు కొందరికి ఎకరాకు రూ.11లక్షలు, మరికొందరికి రూ.12 లక్షలు, రూ.13 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించారన్నారు. కోర్టుకు పోయిన వారికి రూ.18 లక్షల మేరకు నష్టపరిహారం చెల్లించారని తెలిపారు. భూములు కోల్పోయిన రైతులందరికి ఎకరాకు రూ.18 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాంరెడ్డి పల్లెలో మంచాల రమేష్ రెడ్డికి ఉన్న 10 ఎకరాలలో ఒక ఎకరం 75 సెంట్లు రైల్వే లైన్‌కు పోగా 8 ఎకరాల పావు ఉండగా అందులో 2.25 ఎకరాలు రైల్వే లైన్ అవతలికి మిగిలిపోయిందని, మంచాల తులసి రెడ్డి, మరికొందరి భూములు కూడా రైల్వే లైన్‌కు అవతల కొంత భూమి, ఇవతల కొంత భూమి మిగిలిందన్నారు. వీరి పొలాల మధ్యలో 40 అడుగుల ఎత్తు వరకు రైల్వే కట్ట నిర్మించినందున రైతుల వ్యవసాయ అవసరాలకు అటు ఇటు వెళ్ళడానికి కష్టంగా ఉందన్నారు. అందుకు అండర్ పాస్ రోడ్డు నిర్మించాలని, లేదా కట్ట అవతల మిగులుగా ఉన్న రైతుల పొలాలను రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం కొనుగోలు చేయాలన్నారు. స్థానిక రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తగు చర్యలు చేపట్టి రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకు పనులు చేయకుండా నిలుపుదల చేయాలన్నారు. పోలీసులను పెట్టి పనులు చేయించడం మానుకోవాలని మంత్రిని, అధికారులను కోరారు.



రైల్వే లైన్‌లో పోయిన భూములను బాధిత రైతులతో కలిసి పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు



నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు



గృహ ప్రవేశ వేడుకలకు హాజరైన మంత్రి ఎన్ఎండి ఫరూక్

## నూతన గృహ ప్రవేశ వేడుకలో మంత్రి

**పజాశక్తి - నంద్యాల అర్బన్ :** నంద్యాలలోని సాయిబాబా నగర్ తిక్క స్వామి దర్గా పక్కన 24వ వార్డు టిడిపి ఇంచార్జ్ సాయిరాం రాయల్, జ్యోతి రాయల్ నూతనంగా నిర్మించుకున్న గృహ ప్రవేశ కార్యక్రమంకు మంగళవారం రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ హాజరయ్యారు. అలాగే టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ కూడా హాజరయ్యారు

## ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి

**ప్రజాశక్తి - కోవెలకుంట్ల :** కోవెలకుంట్ల మండలంలోని గుంజలపాడు రస్తాలో ట్రాక్టర్‌లో కంకర తోలుతుండగా డ్రైవర్ వెంకట సుబ్బారెడ్డి (35) ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. వివరాలు.. సంజామల మండలం నట్ల కొత్తూరు గ్రామానికి చెందిన వెంకట సుబ్బారెడ్డి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం కంకర తోలుతుండగా ఆయన సీటులో నుండి ఎగిరి కింద పడడంతో వెనుక టైర్లు మీద ఎక్కాయి. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు.

## రాజ వంశస్థుడు త్రివిక్రమ వర్మ మృతి

**ప్రజాశక్తి - అవుకు :** అవుకు పట్టణానికి చెందిన నల్ల తిమ్మరాజు రాజ వంశీకులైన త్రివిక్రమ వర్మ (64) సోమవారం రాత్రి మృతి చెందారు. నంద్యాల నల్ల తిమ్మరాజు వంశస్థులైన త్రివిక్రమ వర్మ అనారోగ్యంతో మతి చెందిన విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ, టిడిపి అవుకు మండల అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డిలు త్రివిక్రమ వర్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అవుకు చెరువులు నిర్మించిన రాజవంశస్థుల త్రివిక్రమ వర్మ మృతి చెందడం బాధాకరమన్నారు.



త్రివిక్రమ వర్మ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న బీసీ ఇందిరా రెడ్డి

# బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి : మంత్రి బీసీ


- భక్తులకు ఉచిత లడ్డు అందజేసేందుకు మంత్రి సొంత నిధులు

**ప్రజాశక్తి - బనగానపల్లె**

అధికారులు సమన్వయంతో పని చేసి యాగంటి ఉమా మహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 25 నుండి మార్చి 1 వరకు జరిగే బ్రహ్మోత్సవాలపై వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే వేలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూ లైన్లు, తాగునీటి వసతి, శానిటేషన్ ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక ప్రజల కంటే దూరం నుండి వచ్చే భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు అందరికీ ఒకే రకమైన క్యూలైన్లను ఏర్పాటు చేయాలన్నారు. కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ అధికారులు బస్ సర్వీస్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సమస్య లేకుండా ప్రత్యేక ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు బ్రహ్మోత్సవాల్లో వాలంటరీలుగా పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. భక్తుల సౌకర్యార్థం టోలెట్‌లను ఎత్తివేయాలని అధికారులను ఆదేశించారు. దేవస్థానంలో ఏసీలు పని చేయడం లేదని, రూప్ 15 లక్షలు సొంత నిధులతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బాత్రూం, మరుగుదొడ్లను ఉపయోగించే భక్తుల వద్ద ఐదు రూపాయలు మాత్రమే వసూలు చేయాలని, అంతకంటే ఎక్కువ వసూలు చేస్తే కాంట్రాక్టర్ పై తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 25, 26, 27 తేదీలలో దేవస్థానానికి వచ్చే భక్తులకు తన సొంత నిధులతో లడ్డును ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. మూడు రోజులు లడ్డుకు అయ్యే ఖర్చును తాను ఇస్తానని దేవాదాయ శాఖ అధికారులు ఉచితంగా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం లడ్డు నాణ్యతగా లేదని, కాంట్రాక్టర్లను రద్దు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ డీఈఓ మోహన్, ఆలయ ఈవో బి. చంద్రుడు, దేవదాయ ఇన్స్పెక్టర్ హరిచంద్ర రెడ్డి, ఎంపీడీవో బివి రమణ, తహశీల్దార్ నారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్, ఏఈ సాయికృష్ణ, ఆర్అండ్‌బి డి సునీల్ రెడ్డి, ఏఈ ఉసేని, ఆర్టీసీ డిఎం కిషోర్ కుమార్, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, ఈవోఆర్డి సతీష్ కుమార్ రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, ఏపీఎం అడ్డాకుల శ్రీనివాసులు, యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మాళేశ్వర రెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, టిడిపి నాయకులు సంగు సంకేశ్వర రెడ్డి, పెద్దరాజుపాలెం భూషన్న, చిన్న రాజుపాలెం కృష్ణా నాయక్, పసుపల బాల నాయుడు, వేములపాడు గుర్రప్ప, మీరాపురం బాలిరెడ్డి ,భాస్కర్ రెడ్డి జోలాపురం తిరుమలయ్య, గంధం పక్కిర, సాదుకోట్టం శ్రీనివాసరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



భూ రీ సర్వేను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

## పకడ్బందీగా భూ రీ సర్వే పనులు : జెసి

**ప్రజాశక్తి - రుద్రవరం :** ప్రతి రోజు 25 ఎకరాలకు మించకుండా రీసర్వే పనులు జరిగేలా రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. మంగళవారం రుద్రవరం మండలం బీరవోలు గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనుల గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మండలాల్లో జరుగుతున్న రీ సర్వే పనులు నిర్దేశిత గడువులోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సరిహద్దు స్థిరీకరణ, స్టోన్ ప్లాంటేషన్ తదితర పనులు కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ కరెక్షన్స్, మ్యుటేషన్ ట్రాన్స్‌యాక్షన్స్ డేటా ఎంట్రీ కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆళ్లగడ్డ మండలం బత్తులూరు గ్రామంలో నూతన పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సంబంధించి అభ్యంతర లేని ధ్రువీకరణ మంజూరు విషయంపై సంబంధిత స్థలాన్ని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. సర్వే అండ్ ల్యాండ్ ఏడి జయరాజ్, తహశీల్దార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి రాక

**ప్రజాశక్తి - అవుకు :** రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నేడు అవుకు పట్టణానికి విచ్చేయనున్నారని టిడిపి కార్యకర్తలు మంగళవారం తెలిపారు. అవుకు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల కోసం అత్యాధునిక పరికరాలను అందజేయుటకు మంత్రి విచ్చేస్తున్నారన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్‌ను వినియోగించుకోవాలి

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ :** సిఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిటీ పెన్నిధి అని, వైద్య పరంగా ఆపదలో ఉన్నవారు సీఎం రిలీఫ్ ఫండ్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. చాగలమర్రి మండలం మద్దూరు గ్రామానికి చెందిన మాధం లక్ష్మీదేవికి 60 వేలు, జమ్ములదిన్నె రామ సుబ్బమ్మకు రూ.45 వేలు చెక్కులను అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు, సీఎం నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

# ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించాలి : కలెక్టర్

**ప్రజాశక్తి - శిరివెళ్ల**

ఉద్యానవన పంటలను రైతులు సాగు చేసేలా సంబంధిత అధికారులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. శిరివెళ్ల మండలంలోని బోయలకుంట్ల గ్రామ పరిధిలో గల శ్రీ ఓంకారేశ్వర వెజిటేబుల్ నర్సరీని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మంగళవారం పరిశీలించారు. ఉద్యానవన పంటలు పండించే రైతులను ప్రోత్సహించేందుకు నర్సరీలో చేపడుతున్న మొక్కలను పరిశీలించి రైతు జింకల నారాయణను అభినందించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా ఆర్గానిక్ రీసెర్చ్ సెంటర్‌లో తయారైన వేస్ట్ డికంపోజర్ వినియోగించి విజిటేబుల్స్ మొక్కలు, రకరకాల పూల మొక్కల ద్వారా శ్రీ ఓంకారేశ్వర నర్సరీ మేనేజర్, రైతు జింకల నారాయణ అధిక దిగుబడులు సాధించడం ప్రశంసనీయమన్నారు. ఉద్యానవన పంటల ద్వారా వాణిజ్య పంటలు అవసరమయ్యే మొక్కలను పెంచుతూ మంచి దిగుబడులకు కారణమవుతున్న రైతును, ఉద్యానవన వ్యవసాయ విధానాన్ని కలెక్టర్ అభినందించారు. నర్సరీలో ఉన్న రకరకాల కూరగాయల మొక్కలను, పూలమొక్కలను అడిగి తెలుసుకున్నారు. చామంతి సాగు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. తెలుపు, పసుపు కలర్ చామంతి పూల మొక్కలను కొబ్బరి తొక్కలో విత్తనం వేసి పూల మొక్కలుగా పెంచి ఉద్యానవన పంటలుగా మార్చడం, ఆహ్లాదకరమైన వాతావరణం అద్వితీయమని పేర్కొన్నారు. ఉద్యానవన శాఖ ఎడి నాగరాజు, హెచ్ఓ దివ్య తదితరులు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్

# బీసీ కార్పొరేషన్ దరఖాస్తుల పరిశీలన

**ప్రజాశక్తి - నంద్యాల రూరల్**

పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బిసి కార్పొరేషన్ లోన్లకు ఆయా గ్రామాల నుండి వచ్చిన దరఖాస్తులను సంబంధిత బ్యాంకు మేనేజర్లు మంగళవారం పరిశీలించారు. ఎంపిడిఓ సుగుణ శ్రీ మాట్లాడుతూ నంద్యాల మండలంలోని భీమవరం, బ్రాహ్మణపల్లి, చాబోలు, చా పిరేవుల గుంతనాల కానాల,పెద్ద కొట్టాలా, మిట్నాల, మునగాల,పోలూరు, పుసులూరు, రాయమాల్పురం, అయ్యలూరు, బిళ్లలాపురం, కొత్తపల్లి గ్రామాల నుండి బీసీ కార్పొరేషన్ లోన్స్ కొరకు 562 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఏ ఒక్క దరఖాస్తు రిజెక్ట్ కాలేదని, తర్వాత పరిశీలనలో నిజమైన లబ్ధిదారులను గుర్తించి బ్యాంకు వారు బీసీ కార్పొరేషన్ లోన్లు మంజూరు చేస్తారన్నారు. కార్యక్రమంలో సంబంధిత బ్యాంకు మేనేజర్లు, వెలుగు ఎపిఎం గుర్రప్పడు, ఏపీఓ శ్రీకళ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## నేటి నుండి బ్రహ్మోత్సవాలు : ఇఒ

• భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ ఇఒ శ్రీనివాసరావు

**ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు**

శ్రీశైల క్షేత్రంలో నేటి నుండి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని, బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఇఒ ఎం. శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆలయ సముదాయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇఒ మాట్లాడారు. క్షేత్రానికి నడకదారుల నుండి వచ్చే భక్తులకు అటవీశాఖ సమన్వయంతో మరుగుదొడ్లు, వసతి, తాగునీరు, వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే భక్తులు ఇబ్బంది పడకుండ సూచిక బోర్డులను తెలుగు, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో ఏర్పాటు చేశామన్నారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా పెచ్చెరవు, కైలాస ద్వారం, అటకేశ్వరం వివిధ ప్రాంతాల్లో అల్పాహారాన్ని, మజ్జిగ, వైద్య శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. అటకేశ్వరం నుండి నడకదారిలో ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని, క్యూలైన్‌లో భక్తులకు ఫ్యాన్లు, తాగునీరు ఎప్పటికప్పుడు శివసేవకులు అందిస్తారని తెలిపారు. అలాగే ప్రతి భక్తుడికి 300 లీటర్ల వాటర్ బాటిల్ ఇచ్చే యోచనలో ఉన్నామన్నారు. బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు ప్రతిరోజు లోపాలను గమనిస్తూ మరుసటి రోజు ఆ లోపాలను సరి చేసుకుంటూ ముందుకెళ్తామన్నారు. భక్తులు ఇబ్బంది పడకుండా 29 కేంద్రాల్లో లడ్డు విక్రయిస్తున్నట్లు తెలిపారు. 25, 26న పోలీసు వ్యవస్థతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తామన్నారు. పుణ్యక్షేత్రంలో పార్కింగ్ ప్రదేశాలు, చలవపందిర్లు గతంలో కన్నా ఎక్కువగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 23న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా శ్రీస్వామి అమ్మవార్లకు సాయంత్రం 6 గంటల తర్వాత పట్టు వస్త్రాలు తీసుకుని శ్రీశైలం వస్తున్నారని తెలిపారు. అలాగే 26న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని ఇఒ తెలిపారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. నరసింహ రెడ్డి, ప్రజా సంబంధాల అధికారి టి. శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి : ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

**ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ :** ప్రభుత్వం నిర్వహించే అధికారిక కార్యక్రమాలకు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎమ్మెల్యే గిత్త జయసూర్య సూచించారు. మంగళవారం నిర్వహించిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దామోదరం సంజీవయ్య జయంతిని అధికారికంగా నిర్వహిస్తే అధికారులు ఎందుకు రాలేకపోయారని ప్రశ్నించారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే కార్యక్రమాల్లో అధికారులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. సర్వసభ్య సమావేశంలో తమ తమ శాఖలకు సంబంధించిన నివేదికలను ఇన్‌టైంలో తయారు చేసి ఇవ్వాలన్నారు. వేసవిలో రాబోయే సమస్యలపై దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపిపి మురళీధర్ రెడ్డి, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం శర్మ, తహశీల్దార్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి


బాధితులతో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎమ్మార్పిఎస్ నాయకులు

**ప్రజాశక్తి - కొత్తపల్లి**

దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు కొండపోగు నాగరాజు మాదిగ, మండల అధ్యక్షులు నాగన్న మాదిగ తెలిపారు. ఈ సందర్భంగా వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. కొత్తపల్లి మండలం పెద్ద గుమ్మడాపురం గ్రామానికి చెందిన కొండం అశోక్, తండ్రి ఉషనయ్య గుమ్మడాపురం గ్రామ పొలిమేరలో మేకలను మేపుతుండగా అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణ కులానికి చెందిన జెడ్. వెంకటేశ్వర రెడ్డి, తండ్రి జెడ్. శివారెడ్డి అనే వ్యక్తులు దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఆటో శీను అనే కౌలు రైతు పొలం బీడుగా ఉండడంతో మేకలు మేపుతుండగా ఇక్కడ ఎందుకు మేపుతున్నావురా మాదిగ అని దుర్భాషలాడుతూ ఇష్టమొచ్చినట్టు కింద పడేసి కాళ్లతో తన్ని భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గమన్నారు. ఊపిరాడకుండా కిందపడేసి గొంతుపై తొక్కుతూ పిడి గుద్దులు గుద్ది అవమానపరిచిన అగ్రకులానికి చెందిన జెడ్. వెంకటేష్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని ఎడల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని నాయకులు బాషపోగు బాలయేసు మాదిగ, ప్రేమ్‌రాజ్ మాదిగ, విజ్జి మాదిగ, పెద్ద గుమ్మడాపురం, ప్రభు, ఎమ్మార్పీఎస్ గ్రామ నాయకులు నాగరాజు మాదిగ, చెల్లిమిళ్ళ రమేష్ మాదిగ, ఈశ్వరయ్య మాదిగ, బాలచంద్రుడు మాదిగ, గువ్వల కుంట్ల చిన్న మాదిగ, కోళ్ల రాజు మాదిగలు హెచ్చరించారు.

## జర్నలిస్టులపై దాడి చేసిన..
## వేణుగోపాల్ నాయుడును శిక్షించాలి


బేతంచెర్లలో..

**ప్రజాశక్తి - బేతంచెర్ల**

పార్వతీపురం మన్యం జిల్లా 'ప్రజాశక్తి' విలేఖరి రామారావుపై దాడి చేసిన టిడిపి నాయకుడు వేణుగోపాల్ నాయుడుపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని బేతంచెర్ల జర్నలిస్టుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిజాలను నిర్భయంగా ప్రజలకు తెలియజేసే వారధి లాంటి పత్రిక, మీడియా విలేకరులపై రాజకీయ నాయకులు దాడి చేయడం పరిపాటిగా మారిందని విమర్శించారు. అధికారం తమ చేతుల్లో ఉందని పత్రికా విలేకరులపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమని, సమాజానికి రాజకీయ నాయకుల నిజస్వరూపాలను బయటపెట్టే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. అనంతరం రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ మహేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజాశక్తి విలేఖరి జి. వేణుగోపాల్, విశాలాంధ్ర విలేఖరి బండ రాముడు, ఉత్తేజిత సుబ్బరాయుడు, వార్త వెంకటేశ్వర్ గౌడ్, ఆంధ్ర పత్రిక మద్దిలేటి స్వామి, ఆంధ్ర అక్షర జొల్లు మద్దిలేటి పాల్గొన్నారు.

**బనగానపల్లె :** పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేఖరి రామారావుపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ డబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ జి.మద్దయ్య యాదవ్, బనగానపల్లె నియోజకవర్గ అధ్యక్షులు గుండం సర్వేశ్వర రెడ్డిలు డిమాండ్ చేశారు. విలేఖరి రామారావుపై దాడి చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవికి ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ యూనియన్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు అరికట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, మండల గౌరవాధ్యక్షులు మండల రఘురామిరెడ్డి, అధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బాల చెన్నయ్య, ఉపాధ్యక్షులు రఘురామిరెడ్డి, మధు, మండల కార్యదర్శి రాజేష్, జర్నలిస్టులు నగేష్, బాలయ్య, సుధాకర్, మనోహర్, కుమారస్వామి, దస్తగిరి, వెంకట రాముడు పాల్గొన్నారు.


బనగానపల్లెలో..

# సామాన్య భక్తుల దర్శనానికి ప్రాధాన్యత

• అన్నిశాఖల సమన్వయంతో శివరాత్రి బ్రహ్మోత్సవాలు • నంద్యాల ఆర్‌డిఒ విశ్వనాథ్

**ప్రజాశక్తి - మహానంది**

మహానంది పుణ్యక్షేత్రంలో ఈ నెల 24 నుండి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే సామాన్య భక్తులకు ప్రాధాన్యత కల్పిస్తూ, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేస్తామని నంద్యాల ఆర్‌డిఒ సి. విశ్వనాథ్ పేర్కొన్నారు. ఆలయం పక్కన ఉన్న పోచ విశ్రాంతి భవనంలో అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులతో ఆర్‌డిఒ అధ్యక్షతన రెండవ కో-ఆర్డినేషన్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ మాట్లాడుతూ సామాన్య భక్తులకు ప్రశాంత వాతావరణంలో దర్శన భాగ్యం కల్పించాలన్నారు. జాగరణ సమయంలో ఎక్కువ సంఖ్యలో భక్తులు వస్తారని, వారి కోసం సాంస్కృతిక కళారూపాలు ఏర్పాటు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలకు సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు, తాగునీటి వసతి, పోలీస్ నిఘా, ఆలయ పరిసరాల శుభ్రత, నాణ్యతతో ప్రసాద వితరణ, ప్రత్యేక క్యూలైన్ల నిర్వహణ, లైటింగ్ సదుపాయం, కోనేరుల శుభ్రతలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూలైన్‌ల ఏర్పాటు, నిరంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. ఆలయ ఇఒ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే వేలాది మంది భక్తుల కోసం ప్రత్యేకంగా ఏడు దర్శన కౌంటర్లు, నాలుగు ప్రసాద కౌంటర్లు, భక్తుల కోసం లక్ష లడ్డులు తయారు చేసినట్లు చెప్పారు. దర్శనానికి ప్రత్యేక క్యూ లైన్లు స్పర్శ దర్శనం, అభిషేకాలు రద్దు చేసినట్లు తెలిపారు. తెల్లవారుజామున మూడు గంటల నుండి భక్తులకు దర్శనాలు, క్షేత్రంలో అన్ని సంఘాల వారితో అన్నదానాల ఏర్పాట్లు, దాతల సహకారంతో క్యూలైన్లలో మంచినీరు, మజ్జిగ, బిస్కెట్ల వితరణ, ఆలయ పరిసరాల్లో వైద్య శిబిరాలు, 105 సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా, రథోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. డిఎస్‌పి జావలి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా పార్కింగ్ స్థలాల్లో బారికేడ్లు, వెహికల్ మేనేజ్మెంట్, మహిళా సిబ్బందితో ప్రత్యేక భద్రత, ఆలయ పరిసరాల్లో నిరంతరం నిఘాపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్టీసీ డిఎం గిరిధర్ మాట్లాడుతూ నంద్యాల నుండి ప్రతి ఐదు నిమిషములకు ఒక బస్సు చొప్పున సుమారు 25 బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా గాజుల పల్లె స్టేషన్ నుండి మహానంది క్షేత్రం వైపు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుత్ శాఖ ఏడి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్సైజ్ శాఖ సిఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ మూడు రోజులు వైన్ షాపులు బంద్ చేపిస్తామని, బెల్ట్ షాపులు లేకుండా చేస్తామన్నారు. సమావేశంలో తహశీల్దార్ పి. రమాదేవి, రూరల్ సిఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి, ఎంపిడిఒ మహమ్మద్ దౌల, విద్యుత్ శాఖ ఎఇ ప్రభాకర్ రెడ్డి, ఫారెస్ట్ శాఖ డిఆర్‌ఒ హైమావతి, ఆలయ ఎఇఒ వై. మధు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ విశ్వనాథ్

# ప్రకృతి సోయగాల నడుమ 'గుండ్ల బ్రహ్మేశ్వరం'

• అశ్వథామ ప్రతిష్ఠించిన ప్రాచీన శివలింగం


గుండ్ల పరమేశ్వర స్వామి ప్రధాన ఆలయం

**ప్రజాశక్తి - బండి ఆత్మకూర్**

జిల్లాలోని నల్లమల అభయారణ్యంలో ప్రకృతి సోయగాల నడుమ వెలసిన గుండ్ల బ్రహ్మేశ్వరం మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమవుతోంది. సముద్రమట్టానికి 1048 మీటర్ల ఎత్తులో ఉన్న గుండ్ల బ్రహ్మేశ్వరం శిఖరంపైన వెలసిన గుండ్ల బ్రహ్మేశ్వర స్వామి ఆలయం చాలా విశిష్టమైంది. గుండ్ల బ్రహ్మేశ్వర ఆలయ ప్రాంతం నుండే గుండ్లకమ్మ నది జన్మించి ప్రకాశం జిల్లాలో ప్రవహిస్తుంది. నల్లమల అడవిని నాగార్జునసాగర్ టైగర్ ప్రాజెక్టుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. కోట్ల రూపాయలు వెచ్చించి వన్యప్రాణులు, పులుల సంరక్షణ కేంద్రంగా నల్లమల అడవిని పరిరక్షిస్తుంది. అటవీ శాఖ అనుమతితోనే ఈ ఆలయంలోకి ప్రవేశించే మార్గాల గుండా భక్తులు వెళ్ళవచ్చు. గుండ్ల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాన్ని 1946లో మొట్టమొదటిగా అటవీ శాఖ కన్జర్వేటర్‌గా పని చేస్తున్న కీర్తిశేషులు చోనీరు సంజప్ప, రేంజ్ అధికారి కీర్తిశేషులు నారాయణ రంగస్వామి, కీర్తిశేషులు ఆవులపాటి పెద్ద పుల్లయ్యలు గుర్తించారు. చెట్ల తీగలతో కప్పి ఉన్న ఈ ఆలయాన్ని శుభ్రపరిచి మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. 1956లో ప్రగాఢ నారాయణ, వాల్మీకి లింగన్న, శ్రీచలం వెంకటప్ప, ప్రకాశం జిల్లా పాపినేని పల్లె గ్రామస్తులు కర్ణం కోటేశ్వరరావులు ఆలయానికి నంది వాహనం, సింహ వాహనం సమర్పించారు. అప్పటి నుండి ఈ దేవాలయంలో ప్రతిఏటా మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం బ్రహ్మోత్సవాలను ఆర్‌జిఎం విద్యా సంస్థల అధినేత మిద్దె శాంతి రాముడు వారి కుమారులు మిద్దె శివరాం, మిద్దె రఘురాం సహాయ సహకారంతో గుండ్ల బ్రహ్మేశ్వర స్వామి భక్తుల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నారు.

**26 నుండి శివరాత్రి ఉత్సవాలు :** మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 26న రుద్రాభిషేకం, రుద్రహోమం, బిల్వార్చన, రాజారాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన, స్వామివారి ఉత్సవం వగైరా పూజలతో పాటు పౌరాణిక నాటకాలు, పురాతన చెక్కభజనలు నిర్వహిస్తారు.


గుండ్ల బ్రహ్మేశ్వర ఆలయంలోని ఉత్సవ మూర్తుల విగ్రహాలు

**పురాతన ఆలయం గుండ్ల బ్రహ్మేశ్వరం**

నల్లమల అభయారణ్యంలో వెలిసిన గుండ్ల బ్రహ్మేశ్వర స్వామి ఆలయం అతిపురాతనమైంది. నారాయణపురం, చిన్నదేవలాపురం, వెలుగోడు, తిమ్మనపల్లి గ్రామాలతో పాటు ప్రకాశం జిల్లాలోని అర్ధవీడు మండలం పాపినేనిపల్లి గ్రామస్తులు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అక్కడ అన్నదానం చేయడం ఆనవాయితీ. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తులు ఏడాదిలో ఒకసారి మాత్రమే గుండ్ల బ్రహ్మేశ్వర స్వామిని దర్శించుకుంటారు.

**- గుండ్ల బ్రహ్మేశ్వర ట్రస్ట్ బోర్డ్ కార్యవర్గ సభ్యులు.**

# పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ నిర్వహణపై ఎమ్మెల్యే ఆరా


హైవే పనులపై ప్రాజెక్టు డైరెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

**ప్రజాశక్తి - బేతంచెర్ల**

మండలంలోని పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం, నిర్వాహకుల తీరుపై ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి మంగళవారం ఆరా తీశారు. ఫ్యాక్టరీ నిర్వహణ తీరుపై కార్మికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే కోట్ల పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీని సందర్శించి స్థానిక గెస్ట్ హౌస్‌లో ఫ్యాక్టరీ నిర్వాహకులు, యాజమాన్యంతో చర్చించారు. దాదాపుగా మూడు నెలల నుండి ఫ్యాక్టరీ కార్యకలాపాలు నిలిచిపోవడంతో ఎమ్మెల్యే కోట్ల వివరాలు సేకరించారు. ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే నిలదీయడంతో సిమెంట్ ఫ్యాక్టరీని నడిపే విషయంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు నిర్వాహకులు ఎమ్మెల్యే తెలిపారు. ఫ్యాక్టరీ కార్యకలాపాలపై కొంత సమయం ఇవ్వాలని ఎమ్మెల్యే కోట్లకు విన్నవించారు. ఇచ్చిన గడువు ముగిసేలోపు ఫ్యాక్టరీ పనులు పునఃప్రారంభం కావాలని లేని పక్షంలో ఫ్యాక్టరీని తమ స్వాధీనంలోకి తెచ్చుకొని కార్మికులకు, స్థానికులకు, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫ్యాక్టరీ కార్యకలాపాల అపోహలపై ఎవరు అధైర్యపడొద్దని ఎమ్మెల్యే స్థానికులకు భరోసా ఇచ్చారు. అలాగే చెన్నంశెట్టి పల్లె నుండి బేతంచెర్ల మీదుగా నేషనల్ హైవే 340 బి పనులు జరుగుతుండడంతో బేతంచెర్ల నుండి గోరుమానుకొండ సీతారాంపురం మీదుగా, కర్నూల్‌కు వెళ్లే రహదారిని తాత్కాలికంగా మూసివేసి, బేతంచెర్ల నుండి బుగ్గానిపల్లి, సిమెంట్ నగర్, తమ్మరాజుపల్లి గ్రామాల మీదుగా నంద్యాల-కర్నూలుకు వెళ్లే ఫోర్ వే మీదుగా మళ్లించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. శుక్రవారం నుండి వాహనదారులు బుగ్గనపల్లి సిమెంట్ నగర్, తమ్మరాజుపల్లె మీదుగా వాహనాల రాకపోకలు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఫజిల్ రెహ్మాన్, ఫ్యాక్టరీ విపి శ్రీనివాసరావు, హైవే ప్రాజెక్టు డైరెక్టర్ జయరాం, టిడిపి మండల కన్వీనర్ ఎల్లా నాగయ్య, మాజీ ఎంపిపి సోమశేఖర్ రెడ్డి, బుగ్గన ప్రసన్నలక్ష్మి, బుగ్గన్న ప్రభాకర్ రెడ్డి, భీమేష్ రెడ్డి, భీమారెడ్డి, నాయకులు మస్తాన్, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, శ్రీనివాస యాదవ్, సయ్యద్‌ముల్ల, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**కొత్తూరు సన్నిధిలో ఎమ్మెల్యే కోట్ల**

**పాణ్యం :** మండలంలోని ప్రముఖశైవక్షేత్రం శ్రీ కొత్తూరు సుబ్బరాయుడు స్వామి సన్నిధిని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి సతీసమేతంగా మంగళవారం దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే దంపతులకు ఆలయ ఇఒ రామకృష్ణ, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి అభిషేకం, అర్చనలు చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది సుబ్బారెడ్డి, జీర్ణోద్ధరణ కమిటీ చైర్మన్ మిలటరీ సుబ్బారెడ్డి, పాణ్యం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, బేతంచెర్ల ఎస్ఐ పాల్గొన్నారు.

# అభ్యసన నైపుణ్యాలు పెంపొందించుకోవాలి : పీడీ


కొత్తపల్లి : శిక్షణలో మాట్లాడుతున్న ఎంఇఒ

**ప్రజాశక్తి - బండి ఆత్మకూర్**

అంగన్వాడీ కార్యకర్తలు కేంద్రాల్లోని ప్రీస్కూల్ విద్యార్థిని, విద్యార్థులకు చేసే అభ్యసనలో మెలకువలు, నైపుణ్యాన్ని పెంపొందించేందుకు వారం రోజులపాటు శిక్షణ ఏర్పాటు చేసినట్లు ఉమెన్స్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్టు డైరెక్టర్ లీలావతి తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంగన్వాడీలకు మంగళవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఎంఇఒలు యశోద, మోహన్‌రెడ్డిల అధ్యక్షతన శిక్షణ నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలకు ఉపాధ్యాయులు రాజశేఖర్, సుదర్శన్, శ్రీనివాసులు శిక్షణ ఇస్తారని తెలిపారు. 3-8ఏళ్లలోపు విద్యార్థులకు విద్యతో పాటు తమ చుట్టూ ఉన్న సమాజ పరిసరాలు, పరిపక్వతపై అంగన్వాడీలకు వివరిస్తారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ రమాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**నందికొట్కూరు టౌన్ :** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ టీచర్లకు 'జ్ఞాన జ్యోతి'పై 15 రోజులపాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ సుభాన్ తెలిపారు. శిక్షణలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 40 మందికి, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 32, మొత్తం 72 మంది అంగన్వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఫోర్స్ డైరెక్టర్‌గా ఎంఇఒ సుభాన్, ప్రభుత్వ పాఠశాల ఉన్నత ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి, ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పార్వతి, ఆర్పీలుగా వేణు మాధవరావు, రామకృష్ణయ్య, అనురాధ, అంగన్వాడీ సూపర్వైజర్ ఆశీర్వాదమ్మ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ప్యాపిలి :** స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సరళ ఆధ్వర్యంలో మండలంలోని అంగన్వాడీ టీచర్లకు ఎంఇఒ వెంకటేష్ నాయక్ జ్ఞాన జ్యోతిపై శిక్షణ ఇచ్చారు. ప్రాథమిక స్థాయిలో భాషా నైపుణ్యాలు, గణితంలో పునాది అభ్యసన సామర్థ్యాలను ఎలా సాధించాలో అంగన్వాడీ టీచర్లకు వివరించారు. 3-6 ఏళ్ల పిల్లలకు కృత్యాధార పద్ధతిలో బోధించడంతో పిల్లల్లో శారీరక, సామాజిక భావోద్వేగ అభివృద్ధి, భాషాభివృద్ధి, మేధోభివృద్ధి చెంది 1వ తరగతికి సంసిద్ధులుగా తయారు చేయడం జ్ఞాన జ్యోతి ముఖ్య ఉద్దేశ్యమన్నారు. శిక్షణలో డీఆర్పీలుగా చిన్నపరెడ్డి, నరసింహారెడ్డి, మల్లేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శకుంతల, దేవకృపలు వ్యవహరిస్తారని తెలిపారు.

**కొత్తపల్లి :** గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడీ చిన్నారులకు విద్యను అందించడం జరుగుతుందని ఎంఇఒ-2 ఇనాయతుల్లా, ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగేశ్వరమ్మ తెలిపారు. బాల్య సంరక్షణ, విద్యపై అంగన్వాడీ టీచర్లుకు జ్ఞానజ్యోతిపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. అంగాన్వాడీ దశ నుంచి వారికి ఒకే చోట విద్యను అందించేలా సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు పౌష్టికాహారం, విద్యా విధానం, పాఠశాల వాతావరణాన్ని వారికి ఏలా అలవాటు చేయాలనే విషయాలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు హరిత, రవణమ్మ, విజయమ్మ, మరియమ్మ, సునీత, నాగమణి, లైసమ్మ పాల్గొన్నారు.

**పగిడ్యాల :** జ్ఞానజ్యోతిపై అంగన్వాడీ కార్యకర్తలకు పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఎంఇఒ మురళీ మహన్ రెడ్డి మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించిన పిల్లలకు అహ్లాదకరమైన ఆటపాటలతో విద్యను బోధించాలని సూచించారు. పిల్లలకు నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సూపర్వైజర్ శేషమ్మ, డిఆర్పిలు శ్రీనివాసులు, సత్యనారాయణ, రంగస్వామి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప కారాగారాన్ని అదనపు జిల్లా జడ్జి తనిఖీ

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

పట్టణంలోని ఉపకారాగారాన్ని ఐదవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు ఆర్విఎస్ మురళీకృష్ణ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. జైలులోని వసతులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం జైలులోని ముద్దాయిలతో మాట్లాడారు. ముద్దాయిలకు న్యాయవాది ఉన్నారా లేదా అని ఆరా తీశారు. ఆర్థిక స్తోమత లేకుండా న్యాయవాదిని నియమించుకోలేని వారికోసం ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. సబ్ జైల్లో ఏదైనా సమస్యలు ఉంటే లీగల్ ఎయిడ్ క్లినిక్‌లోని న్యాయవాది ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ఆన్లైన్ నెంబర్ 15100 కు కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. భోజన వసతులు, వైద్యాధికారి సందర్శనలు జరుగుతున్నాయా..? అవి బాగున్నాయా అని ముద్దాయిలని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు ఇన్చార్జి సూపరింటెండెంట్ యోగేష్ కుమార్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం

**ప్రజాశక్తి - చాగలమర్రి :** మండలంలోని మూడు రాళ్లపల్లి గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు ప్రథమ వార్షికోత్సవం కళ్యాణం నిర్వహించారు. వేద పండితులు నరసింహ శాస్త్రి మరికొంతమంది వేదపండితులతో కలిసి హోమం, స్వామి వారికి కళ్యాణం నిర్వహించారు. భక్తులందరికీ గ్రామాల పెద్దల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

**బండ లాగుడుపోటీలు ప్రారంభం :** శ్రీదేవి భూదేవి వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా బండలాగు పోటీలను పులిచిన్న ఓబుల్ రెడ్డి ప్రారంభించారు. మొదటి బహుమతి చక్రం బీడీ అధినేత ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి ముళ్ళ షబ్బీర్ అహ్మద్ 125 సిసి ఫైన్ టు వీలర్. రెండవ బహుమతి మోహన్ రెడ్డి, మూడురాళ్లపల్లె రామాంజనేయులు రెడ్డి పొద్దుటూరు ఆయిల్ మిల్ 100 సిసి చైన్ టు వీలర్, మూడో బహుమతి షేక్ అహ్మద్ రఫీ 40,000. నాలుగో బహుమతి వెంకటసుబ్బారెడ్డి మదిరేపల్లె 30,000. ఐదో బహుమతి 20000 సూర్యనారాయణ రెడ్డి ఎంఈఓ, ఆరో బహుమతి శ్రీనివాస్ రెడ్డి ప్రమోద్ ఆగ్రోటెక్ 15,000. ఏడవ బహుమతి గ్రోమోర్ రఫీ గిఫ్ట్ ప్రదానం చేశారు.

## వైద్యశాలను డిఎంహెచ్ఒ తనిఖీ

**ప్రజాశక్తి - వెలుగోడు :** నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ మోత్కూర్ వైద్యశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. రోగులకు అందించే మందులను, చికిత్స విధానాలను పరిశీలించారు. ప్రతిరోజు ఒపి విభాగం వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు సాధ్యమైనంత వరకు నార్మల్ కాన్పు అయ్యేలా సూచనలు ఇవ్వాలని తెలిపారు. మాతా శిశుసంరక్షణ చర్యలు, ల్యాబ్, వ్యాధి నిరోధక టీకాల గదిని పరిశీలించారు. ఆయన వెంట మోత్కూరు వైద్య సిబ్బంది ఉన్నారు.

## క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలి

**ప్రజాశక్తి - ఆత్మకూర్ :** క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రతి పోటీలోనూ కనపర్చాలని స్థానిక మిస్టర్ టి స్టాల్ అధినేత వెంకటేష్ అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఆత్మకూర్ హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ కబడ్డీ టీంకు పది జతల స్పోర్ట్స్ దుస్తులను ఆయన సోమవారం పంపిణీ చేసి మాట్లాడారు. క్రీడాకారులను నిరంతరం ప్రోత్సహిస్తూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. క్రీడల ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, క్రీడల ద్వారా ఆరోగ్యంతోపాటు స్నేహభావాలు, పోటీతత్వం అలవర్చుకోవాలన్నారు. క్రీడల్లో మంచి ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రులకు, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అనంతరం హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారులు మిస్టర్ టి స్టాల్ అధినేత వెంకటేష్‌ను పూలమాల శాలువతో ఘనంగా సత్కరించారని ఆత్మకూరు హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ కబడ్డీ టీం క్రీడాకారులు తెలిపారు.

## రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోండి

**ప్రజాశక్తి - కోవెలకుంట్ల :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలకు అర్హులను గుర్తించాలంటే ప్రతి రైతు సేవా కేంద్రంలో ఆధార్ జిరాక్స్, పొలం పాస్బుక్ జిరాక్స్, మొబైల్ నెంబర్ ఇచ్చి పేరు నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి నిరంజన్ యాదవ్ తెలిపారు. మంగళవారం మండలంలోని సౌదరదిన్నె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు అగ్రి స్టాక్ ప్రాజెక్టు కింద ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ ఆన్లైన్ ద్వారా పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.

## 'ఈ-శ్రమ్' రిజిస్ట్రేషన్లలో..
## వేగం పెంచాలి : ఎంపిడిఒ

**ప్రజాశక్తి - మిడుతూరు :** ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్లలో అసంఘటిత కార్మికుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపిడిఒ దశరథరామయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల్లోని చిన్న, సన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలు, తాపీమేస్త్రిలు, శానిటరీ వర్కర్స్, ఎలక్ట్రీషన్, ఇసుక బట్టీల్లో పని చేసే కూలీలు, రిక్షా కార్మికులు, టైల్స్‌లో పని చేసేవారు, భవన నిర్మాణ కార్మికులు, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్, కుమ్మరి, కమ్మరి, స్వర్ణ కార్మికులు, తోపుడు బండ్ల, వీధి వ్యాపారస్తులను గుర్తించాలి నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలు, మధ్యాహ్న భోజన కార్మికులందరూ ఈ-శ్రామ్ కార్డుల నమోదుకు అర్హులని, అసంఘటిత కార్మికులుగా గుర్తించి ఎంత మంది అర్హులు ఉన్నారో జాబితా సిద్ధం చేయాలని డిఇఒకు సూచించారు. చేనేత, అంగన్వాడీ కార్మికులను నమోదు చేయాలని కోరారు. చేరిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక గుర్తింపు నంబరు యూనివర్సల్ అకౌంట్ నంబర్ కార్డు జారీ చేస్తారని తెలిపారు. ఈ కార్డు ఉంటేనే ప్రభుత్వ సామాజిక భద్రత, ఇందులో నమోదైన ప్రతి కార్మికునికి ఎడాది పాటు ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన ప్రయోజనాలు అందుతుందని ఎంపిడిఒ తెలిపారు.

## 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**ప్రజాశక్తి - పగిడ్యాల :** పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని మండల ప్రత్యేక అధికారి జి పరమేశ్వరి విద్యార్థులకు సూచించారు. మండలంలోని లక్ష్మాపురం అంచ సమీపాన ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినిలకు పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిళ్లను ఆమె మంగళవారం పంపిణీ చేసి మాట్లాడారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆమె కోరారు. చదువుకునే వయసులో కష్టపడి ఇష్టంతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. మంచి మార్కులు సాధిస్తే ఉన్నత స్థాయిలో మంచి ఉద్యోగాలు సాధించొచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ మురళీమోహన్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట రమణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్కిల్ హబ్‌లో కోర్సులకు ఉచిత శిక్షణ

**- ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. సునీత**

**ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్లో కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. సునీత పేర్కొన్నారు. ఉచిత కోర్సులకు సంబంధించిన పోస్టర్లను ఆమె మంగళవారం కళాశాల సిబ్బందితో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. వెబ్ డెవలపర్, అసోసియేట్ కస్టమర్స్, ఎగ్జిక్యూటివ్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వెబ్ డెవలపర్ కోర్సుకు ఇంటర్, ఆపై చదివిన వారు అర్హులని చెప్పారు. అసోసియేట్ కస్టమర్ ఎగ్జిక్యూటివ్ కోర్సుకు 10వ తరగతి నుండి ఆపై చదివిన వారు అర్హులన్నారు. 18-30ఏళ్ల మధ్య ఉన్న స్త్రీలు, పురుషులు అర్హులని తెలిపారు. కోర్సు కాల పరిమితి 3 నెలల పాటు ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఫోన్ నెం. 9154830286ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి పరిమళ పాల్గొన్నారు.

## ఆడపిల్లల పట్ల అనురాగంతో మెలగాలి

**ప్రజాశక్తి - పాణ్యం :** ఆడపిల్లల పట్ల అనురాగభావంతో మెలగాలని మహిళా పోలీస్ సిఐ రమేష్ కుమార్ అన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బాలురు ర్యాగింగ్, ఆడపిల్లల పట్ల దురుసుగా ప్రవర్తించడం వంటి వాటికి దూరంగా ఉండాలని చెప్పారు. అమర్యాదగా ప్రవర్తిస్తే చట్టంలోని అన్ని రకాల శిక్షల గురించి విద్యార్థులకు వివరించారు. ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పి. దేవదానం మాట్లాడుతూ పాఠశాలలో వసతులను పరిశీలించానని అన్ని మెరుగ్గా ఉన్నాయని, కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.